కొత్త రేషన్ కార్డులు అందేనా?

- మీ–సేవా కేంద్రాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు
- రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపులు
- నెలాఖరులోపు రేషన్‌కార్డుల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రేషన్‌కార్డులు లేక అనేకమంది పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్డులు లేకపోవడంతో రేషన్ దుకాణం నుంచి తక్కువ ధరకు వచ్చే బియ్యం, సరుకులను కొనుగోలు చేయలేకపోతున్నారు. దీంతో బయట దుకాణాల్లో సరుకులను కొనుగోలు చేస్తూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. రేషన్‌కార్డుల కోసం ఏళ్ల తరబడిగా ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ అమలు చేసే పలు సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు అవసరం కావడంతో ఏమీ చేయలేని పరిస్థితులతో సతమతమవుతున్నారు. గతంలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా ఎంతోమందికి రేషన్ కార్డు రాకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డు ఇస్తామని హామీనివ్వడంతో ప్రజల్లో ఆశలు చిగురించాయి.

మీ-సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు..

ప్రభుత్వం ఈ నెలాఖరులో రేషన్ కార్డుల ప్రక్రియను మొదలు పెడతామని చెప్పడంతో ప్రజలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కేంద్రాల వద్ద క్యూలు కడుతున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా ఏలాంటి ఆదేశాలు రాలేవని మీ-సేవా నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చేవారిని వెనక్కి పంపిస్తున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో...

గత ప్రభుత్వంలో రేషన్‌కార్డుల కోసం జిల్లా వ్యాప్తంగా 1,32,353 దరఖాస్తు చేసుకున్నారు. అందులో 69,631 దరఖాస్తులను పరిశీలనకు ఉంచారు. మిగతా 14,977 దరఖాస్తులను తిరస్కరించారు. గత ప్రభుత్వంలో జరిగిన ఉపఎన్నిక కారణంగా వెబ్సైట్ మూసి వేయడంతో 47,745 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

సరుకుల సంఖ్య పెంచాలని విన్నపం

నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం స్పందించి రేషన్ దుకాణంలో అన్ని నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని పలువురు కోరుతున్నారు. గతంలో అనేక సరుకులు లభించేవని, ప్రస్తుతం బియ్యం మాత్రమే ఇస్తుండటంతో మిగతా సరుకులను కూడా అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ కార్డులు ఇవ్వాలి



ప్రభుత్వం అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలి. మాకు రేషన్ కార్డు ఉన్నా మా పిల్లల పేర్లు ఇప్పటివరకూ కార్డులో చేర్పించలేదు. రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు చేర్పించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించాలి.

– రమేష్, పటాన్‌చెరు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని తాటిపల్లి గ్రామంలో యూనైటెడ్ స్కూల్‌లో సెమీ క్రిస్టమస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు మల్లేశం, డైరెక్టర్ పట్లూరి మల్లేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: పట్టణ పరిధిలోని పస్తాపూర్ ఆర్ఎల్ఆర్ స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని ఆచార్య పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో...

పటాన్‌చెరు పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ఫాదర్ జోసఫ్ బాబు సందేశం ఇచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు



కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్ రెడ్డి నివాసంలో శనివారం అయ్యప్ప మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు పుష్పనగేష్, కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న నగర మేయర్ విజయలక్ష్మి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

క్లుప్తంగా

క్రిస్మస్ దుస్తులు పంపిణీ



దుస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: క్రిస్మస్‌ను పురస్కరించుకుని ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎంపీపీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి కలిసి పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్‌లో మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకారెడ్డి, జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక లారీల సీజ్

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని బ్యాతోల్, ఎర్దనూర్ శివారుల్లో ఇసుక తరలిస్తున్న రెండు లారీలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉచిత ప్రయాణాన్ని సవరించాలి

నారాయణఖేడ్: మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని సవరించాలని ధర్మ సమాజ్ పార్టీ ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు, న్యాయవాది అలిగే జీవన్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఖేడ్ ఆర్డీఓ వెంకటేష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న మహిళలకే అవకాశం కల్పిస్తే మహిళా ఉద్యోగినులు, రూ.లక్షలు సంపాదించే మహిళలను నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. ఉచిత ప్రయాణం కారణంగా ఆటో కార్మికులు నష్టపోతున్నందునా నెలకు రూ.3వేల ఆర్థికసాయం అందించాలని కోరారు. నాయకులు రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

మునిపల్లి(అందోల్): క్రీడల్లో గెలుపోటములు సహజమని మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. ఇటీవల తాటిపల్లిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను తాటిపల్లి సర్పంచ్ అంజిరెడ్డి, గ్రామపెద్దలు వెంకటలక్ష్మారెడ్డితో కలిసి బహుమతులను ప్రదానం చేశారు. రెండు రోజులుగా వాలీబాల్ పోటీల్లో దామోదర రాజనర్సింహ జట్టు మొదటి బహుమతి రూ.30,000 కైవసం చేసుకుంది. ద్వితీయ బహుమతి పిల్లోడి వాలీబాల్ జట్టు రూ.15.000 కైవసం చేసుకుంది. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు నర్సింహులు, రాములు, మైపాల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రక్తదానం.. మహాదానం

జోగిపేట(అందోల్): రక్తదానం మహాదానమని ఆర్డీఓ పాండు అన్నారు. జోగిపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా 10వ వార్డు కౌన్సిలర్ రేఖ, వార్డు యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని శనివారం ఆర్డీఓ ప్రారంభించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అస్పత్రి బ్లడ్ బ్యాంక్ బృందం సభ్యులు, తహశీల్దార్ అంటోని, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీల సస్పెన్షన్‌ను ఖండించాలి

నారాయణఖేడ్: పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. నారాయణఖేడ్‌లోని ఆ పార్టీ డివిజన్‌స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. పార్లమెంట్‌లో పొగబాంబులను వదిలినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్, ఖేడ్ డివిజన్ నాయకులు చిరంజీవి, రమేష్, అరుణ్, ప్రశాంత్, సతీష్ పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ బహూకరణ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలకు ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందాలన్న ఉద్దేశంతో వాటర్ ఫిల్టర్‌ను బహుకరించామని అధ్యక్షురాలు కల్పన మారంవార్ తెలిపారు. ఆ సంఘం ఉపాధ్యక్షురాలు మంకాల్ వీరమణి, కోశాధికారి నవనీత, నాయకులు బాలచందర్, సత్యనారాయణ, జగన్నాథ్ పాల్గొన్నారు.

డ్రోన్ స్ప్రేయింగ్‌తో రైతులకు ప్రయోజనం

ఝరాసంగం(జహీరాబాద్): వ్యవసాయరంగంలో డ్రోన్ స్ప్రేయింగ్ ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని సిద్దాపూర్ క్లస్టర్ ఏఈఓ శివప్రియ అన్నారు. మండల పరిధిలోని సిద్దాపూర్, వనంపల్లి గ్రామాలలో డ్రోన్ స్ప్రెయిన్ ద్వారా కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రోన్స్ ప్రేయింగ్ ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు ఆదాయం పెరిగే మార్గాలు ఉంటాయని సూచించారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి
- రూ.49.64లక్షల పనులను ఆమోదం
- సమస్యలు పరిష్కరించాలని సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

జిన్నారం(పటాన్‌చెరు): సమష్టి కృషి, సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. బొల్లారం మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని రోజారాణి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవటంలేదని ఆరోపించారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే బొల్లారం అభివృద్ధిలో ముందుకు సాగిందని, మున్సిపాలిటీగా ఏర్పాటయ్యాక అభివృద్ధిలో పూర్తిగా వెనకబడిందని వాపోయారు. అదేవిధంగా మంజీరా నీటి సరఫరా సక్రమంగా లేకపోవటంతో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని సభ్యులు వివరించారు. పారిశుధ్యం, రోడ్లు అధ్వాన్నంగా మారాయన్నారు. కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా అభివృద్ధి జరగటంలేదని సభ్యులు ఆరోపించారు. కౌన్సిల్ సమావేశంలో రూ.49.64లక్షల అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజరాణి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేవిధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకెళ్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా 'వైకుంఠ' వేడుకలు

జిల్లా వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

– సంగారెడ్డి డెస్క్

భారతి సిమెంట్ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ



ప్రసాదం పంపిణీ చేస్తున్న భారతి సిమెంట్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కొండల్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్: ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురంలో భక్తులకు భారతి సిమెంట్ వారి ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతి సిమెంట్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కొండల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రసాద పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ సతీశ్‌కుమార్, టెక్నికల్ మేనేజర్ సునీల్ కోట, అసిస్టెంట్ మేనేజింగ్ మార్కెటింగ్ గంగాధర్ రెడ్డి, డీలర్ కృష్ణకాంత్, ప్రశాంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా గీతా జయంతి**

నారాయణఖేడ్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితులు మోహన్‌జ్యోషి ఆధ్వర్యంలో గీతాపారాయణంతో పాటు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాల్లో భగవద్గీతకు విశిష్ట స్థానం

పటాన్‌చెరు టౌన్: గ్రంథాల్లో భగవద్గీతకు విశిష్ట స్థానం ఉందని, గీతను పవిత్ర గ్రంథంగా భావించి పూజిస్తారని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని విద్య భారతి పాఠశాల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గీతా జయంతిలో కార్పొరేటర్ పాల్గొన్నారు.

◆ **నేడు సెమీ క్రిస్మస్ వేడుకలు**

నారాయణఖేడ్: ఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు ప్రభుత్వం తరఫున నియోజకవర్గంలోని అన్ని చర్చిల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సెమీ క్రిస్మస్‌ను విజయవంతం చేయాలని ఖేడ్ హెబ్రోను చర్చి సభ్యులు అమృత్, సాయిలు, ప్రశాంత్, పీటర్, అంజయ్య, సంజీవ్, ఏసుదాస్ తెలిపారు.

◆ **మోటారు సైకిళ్లు సీజ్**

నారాయణఖేడ్: పట్టణంలో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మైనర్లు నడుపుతున్న 10 మోటారు సైకిళ్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. ఆయా మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి మైనర్లు వాహనాలు నడిపితే జరిగే అనర్థాలపై కౌన్సెలింగ్ ఇచ్చి ఇకమీదట మైనర్లకు వాహనాలు నడపడానికి ఇస్తే ఇచ్చినవారిపైనా చర్యలు తీసుకుంటామని వివరించారు. వాహనాలను నడిపే ప్రతిఒక్కరూ వాహన ధ్రువపత్రాలు, బీమా, డ్రైవింగ్ లైసెన్స్‌లను వెంట ఉంచుకోవాలని సూచించారు.

◆ **ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడిగా అబ్రహం**

జహీరాబాద్: మహాజన్ సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడిగా జహీరాబాద్‌కు చెందిన అబ్రహం మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ తన నియామకానికి పాటుపడిన పార్టీ జిల్లా ఇన్‌చార్జి భిక్షపతికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ **షార్ట్‌సర్క్యూట్‌తో ఆటో దగ్ధం**

సంగారెడ్డి టౌన్: షార్ట్ సర్క్యూట్‌తో ఆటో దగ్ధమైన ఘటన సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద శంకరంపేట్‌కు చెందిన భానుకుమార్ హైదరాబాద్ నుంచి శంకరంపేట వెళ్తుండగా సంగారెడ్డి పట్టణ శివారుకు రాగానే అకస్మాత్తుగా ఆటోలో షార్ట్ సర్క్యూట్‌తో ఆటోకు నిప్పంటుకుంది. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.



పూర్వ విద్యార్థులతో అధ్యాపకులు

అ'పూర్వ' సమ్మేళనం

పటాన్‌చెరు: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో (హోమ్ కమింగ్ 2003) పేరిట శనివారం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందరర్భంగా విద్యార్థులకు గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి, గీతం అధ్యక్షుడు శ్రీభరత్ శుభాకాంక్షలు తెలిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము చదివిన విద్యా సంస్థను సందర్శించడంపై ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

రైతు లేనిదే.. రాజ్యం లేదు



సదాశివపేట రూరల్: రైతులను సన్మానించిన నాయకులు



జహీరాబాద్ టౌన్: రైతుల వేషధారణలో ఆచార్య పాఠశాల విద్యార్థులు

- డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి
- ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రైతు లేనిదే.. రాజ్యం లేదని, రైతులే దేశానికి వెన్నెముక అని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మద్దికుంట రైతు వేదికలో శనివారం మంజీర రైతు సమాఖ్య అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ అరిఫొద్దీన్, సంఘం నాయకులు సంగమేశ్వర్, రవీందర్, సంగిశెట్టి, వెంకట్‌రావు పాటిల్, జైపాల్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతులకు సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలోని రైతు సంఘం భవనంలో శనివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన ఆదర్శ రైతులతో పాటు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ నర్సింహారెడ్డి ఆయా గ్రామాల రైతులు, అధికారులు పాల్గొన్నారు.



రైతును సన్మానిస్తున్న రైతు సంఘం నాయకులు

ఖానాపూర్‌లో..

కోహీర్(జహీరాబాద్): మండల పరిధిలోని ఖానాపూర్‌లో జెంక్రిస్ట్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జెంక్రిస్ట్ రీజనల్ బిజినెస్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ చీడపీడల నుంచి పంటలను ఏవిధంగా కాపాడుకోవాలి.. తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ మదన్ హరూన్, రైతులు పాల్గొన్నారు.

ఆచార్య పాఠశాలలో..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య పాఠశాలలో రైతు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతుల వేషాధారణతో ఆకట్టుకున్నారు. చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటరాంరెడ్డి, ప్రిన్సిపాల్ మోసెస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు సన్మానం


వట్‌పల్లి(అందోల్): రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని మర్వెల్లి గ్రామంలో తెలంగాణ రైతు సమాఖ్య ఆధ్వర్యంలో రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా రైతు సమాఖ్య అధ్యక్షుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో పంటలు నష్టపోయిన రైతులకు పంటనష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మాజీ స్కోర్ చైర్మన్ సంగమేశ్వర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షిస్తాం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండల పరిధిలో ప్రభుత్వ భూములు పరిరక్షణకు ప్రత్యేకంగా అధికారుల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నామని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఐలాపూర్ తండాలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐలాపూర్, ఐలాపూర్ తండా పరిధిలో ఉన్న 1260 ఎకరాల భూమి కోర్టు వివాదంలో ఉందన్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌరీవచ్చల, సర్వే అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

ఇష్టం లేకపోతే స్వచ్ఛందంగా తప్పుకోండి

ఎంపీపీ గిరిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: అధికారులు సక్రమంగా పనిచేయాలి.. ఇష్టం లేకుంటే స్వచ్ఛందంగా తప్పుకోవచ్చని ఎంపీపీ గిరిధర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. గిరధర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల విషయమై పలుమార్లు సమావేశాల్లో ప్రస్తావిస్తున్నా అధికారులు వాటిని పెడచెవిన పెడుతున్నారన్నారు. పనిచేసే ఇష్టం లేకుంటే సెలవుపై వెళ్లాలని, లేకుండా ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోవచ్చని సూచించారు. శేఖాపూర్ గ్రామంలో రెండువేల పైచిలుకు ఎకరాల భూమి వివాదస్పదంగా ఉందని, దీన్ని పరిష్కరించేలా చూడాలని గ్రామస్తులు అధికారులకు మొర పెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, ఎంపీడీఓ సుమతి, వైస్ ఎంపీపీ రాములు, సభ్యులు మైనొద్దీన్, నర్సింహులు, జగన్, నర్సింహారెడ్డి, జ్యోతి, పాండురంగారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.